క్లుప్తంగా

పాఠశాల తనిఖీ

దక్కిలి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం రుచికరమైన భోజనం అందించాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఆయన సోమవారం మండలంలోని కుప్పాయపాళెం మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. అనంతరం పాఠశాలలో రికార్డులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు.

కొమ్మల కత్తిరింపు అవసరం

సైదాపురం: మామిడి రైతులు, కొమ్మల కత్తిరింపుతో మంచి పంట దిగుబడులు సాధించవచ్చని పొదలకూరు ఉద్యానవన శాఖాధికారి ఆనంద్ తెలిపారు. పండ్ల తోటల రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే దీర్ఘకాలికంగా తోటలు పెరిగి మంచి పంట దిగుబడులతో లాభం పొందవచ్చన్నారు. చెట్లు గుబురుగా ఉండడంతో గాలి, వెలుతురు, సూర్యరశ్మి తగలక పంట సరిగా రాదన్నారు. ప్రతి ఏడాది జూలై–సెప్టెంబర్ మధ్య కాలంలో గుబురుగా ఉన్న చెట్ల కొమ్మల కత్తిరించాలని సూచించారు.

ప్రో కబడ్డీ లీగ్ పోటీలకు వెంకటగిరి మహిళ


శ్రీదేవి

వెంకటగిరి రూరల్: 12వ సీజన్ ప్రో కబడ్డీ లీగ్ పోటీలకు వెంకటగిరి మండలం 9వ బెటాలియన్‌కు చెందిన టెక్నికల్ అధికారి కోమటి రవికుమార్ సతీమణి కోమటి శ్రీదేవి ఎంపికయ్యారు. సెప్టెంబర్ 29 నుంచి నవంబర్ 1 వరకు విశాఖ, జైపూర్, చెన్నై, ఢిల్లీలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం

పెళ్లకూరు: క్రీడలతో శారీరక ధారుఢ్యం పెంపొందుతుందని స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా తెలిపారు. ఆమె సోమవారం చెంబేడు జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో అండర్ 14, అండర్ 17 మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. మూడు రోజుల పాటు ఈ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ


క్రీడాకారులతో మాస్టర్ పవన్ కుమార్

నాయుడుపేటటౌన్ : తైక్వాండో కలర్ బెల్ట్ పోటీల్లో నాయుడుపేట తైక్వాండో క్లబ్‌కు చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటినట్లు సోమవారం స్థానిక తైక్వాండో క్లబ్ ఫౌండర్ ఉయ్యాల పవన్ కుమార్ తెలిపారు. ఇందుకూరుపేట మండలం కొత్తూరులో జీవీకే చిన్మయ విద్యాలయంలో నెల్లూరు జిల్లా యూత్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఈ పోటీలు జరిగినట్లు వెల్లడించారు. ఈ పోటీల్లో 150 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటే, నాయుడుపేటకు చెందిన 30 మంది ప్రతిభ చాటారని చెప్పారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

గూడూరురూరల్ : యువత డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కామెల్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ సుహాసిని కోరారు. గూడూరు రెండో పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల, అర్బన్ హెల్త్ సెంటర్, బాలాజీ కళాశాలల్లో సోమవారం ఇంటెన్సిఫైడ్ ఐఈసీ కంపెనింగ్ ద్వారా హెచ్.ఐ.వి/ఎయిడ్స్, డ్రగ్ డీ అడిక్షన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఏఐటీయూసీ ధర్నా

గూడూరురూరల్ : భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమమే లక్ష్యమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. గూడూరు సబ్‌కలెక్టరేట్ వద్ద సోమవారం ఏఐటీయూసీ, భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మీరాభాయ్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, నాయకులు సునీల్, వెంకటయ్య, మస్తాన్, రవీంద్ర, దస్తగిరి, జిలాని, బాల, పురుషోత్తం, మణి, వెంకటేష్, కరీముల్లా, మాబాషా, చిన్న పాల్గొన్నారు.

మాబాషాకు అంబేడ్కర్ పురస్కారం

సూళ్లూరుపేట: పట్టణానికి చెందిన మాబాషా సేవలను గుర్తించి మహల్ మదర్ సర్వీస్ సొసైటీ వారు డాక్టర్ అంబేడ్కర్ జాతీయ సేవారత్న అనే పురస్కారంతో సత్కరించినట్లు చిరంజీవి సేవా సంఘం వారు తెలియజేశారు. విజయవాడలోని అక్కినేని నాగేశ్వరరావు కళాకేంద్రం గ్రంథాలయంలో సోమవారం ఈ పురస్కారాన్ని మాబాషా అందుకున్నారు.


పురస్కారాన్ని అందుకుంటున్న మాబాషా

చికెన్ ధరలు		16-09-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	150
లేయర్ లైవ్	:	115
బ్రాయిలర్ చికెన్	:	264
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	290
లేయర్ చికెన్	:	195


మట్టి తవ్వకాలతో పెద్ద అగాధాలుగా మారిన కమ్మవారిపాళెం చెరువు


చెరువులో మట్టిని తవ్వుతున్న యంత్రం


చెరువు నుంచి మట్టి తరలిస్తున్న టిప్పర్లు

చెరువు సర్వనాశనం

- యథేచ్ఛగా మట్టి అక్రమ తరలింపు
- కమ్మవారిపాళెంలో కూటమి దురాగతం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

నాయుడుపేటటౌన్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక వైపు కబ్జాలు, మరో వైపు చెరువులు, అడవులు నాశనం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. మండలంలోని కమ్మవారిపాళెంలో చెరువులు, ప్రభుత్వ, అటవీ భూముల్లో మట్టి, గ్రావెల్‌ను ఇష్టారాజ్యంగా తవ్వి అక్రమంగా తరలించేస్తున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా కమ్మవారిపాళెం చెరువులో జేసీబీ, భారీ హిటాచీ లాంటి యంత్రాలతో తవ్వకాలు చేపట్టి టిప్పర్లలో తరలించుకుని పోతున్నారు. రహదారి నిర్మాణ పనులకు ప్రభుత్వ అనుమతులు ఉన్న క్వారీల నుంచి మట్టి గ్రావెల్ ను తరలించాల్సి ఉంది. అయితే ఇక్కడ కూటమి నేతలే కాంట్రాక్టర్లుగా అవతారం ఎత్తి గత కొద్ది రోజులుగా పెద్ద సంఖ్యలో టిప్పర్లతో మట్టి తరలించేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం. సుమారు 150 ఎకరాలకు సాగునీరు అందించే ఈ చెరువును ధ్వంసం చేస్తున్నారు. దీన్ని స్థానికులు కొందరు అడ్డుకోవడంతో పోలీసులతో బెదిరింపులకు గురిచేస్తున్నారు. శాంతిభద్రతలు రక్షించాల్సిన పోలీసులు అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. చెరువులో అగాధాలుగా తవ్వి ఉండడాన్ని గూడూరు డివిజన్ ఇరిగేషన్ అధికారులు ప్రత్యక్షంగా చూసి కూడా ఏమీ తెలియనట్లు వెళ్లిపోవడంతో గ్రామస్తులు విస్తుపోయారు. ఈ విషయమై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి చెరువులో ఇష్టారాజ్యంగా జరుగుతున్న మట్టి అక్రమ తరలింపును అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మేత భూముల సర్వే

సాక్షి ఎఫెక్ట్..

పెళ్లకూరు: మండలంలోని రోసనూరు గ్రామం సర్వే నంబరు 276–1లో 28.31 ఎకరాలు ఉన్న ప్రభుత్వ మేత పోరంబోకు భూములను సోమవారం రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. గ్రామంలో ఉన్న మేత భూములను అధికార పార్టీకి చెందిన స్థానికేతరులు కబ్జా చేయడంతో 'కూటమి నేతల భూ మేత' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ యంత్రాంగం కదిలింది. మేత భూములను పూర్తి స్థాయిలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసింది. మేత భూములను కబ్జా చేసిన వారికి త్వరలో నోటీసులు జారీ చేస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో వంశీకృష్ణ, సర్వేయర్లు సుప్రజ, సూర్య, వీఆర్‌ఏ మోహన్ పాల్గొన్నారు.


గ్రామస్తులతో కలిసి మేత భూములు పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

భారతదేశపు ఆణిముత్యం మోక్షగుండం

గూడూరురూరల్ : భారతదేశపు ఆణిముత్యం మోక్షగుండం అని పంచాయతీరాజ్ ఈఈ రమణయ్య అన్నారు. భారతదేశ ప్రఖ్యాత ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం గూడూరులోని పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయం సమావేశ మందిరంలో జాతీయ ఇంజనీర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి యువ ఇంజినీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం వివిధ శాఖల్లో ప్రతిభ కనబరచిన 12 మంది ఇంజినీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు అక్కన రమణయ్య, విశ్రాంత ఈఈ ఎస్.గిరినాథ్, డీఈఈలు పాల్గొన్నారు.


ఇంజనీర్లను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

విశ్వేశ్వరయ్య ఆదర్శం

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో సోమవారం భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఘన నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కళాశాల డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి కొనియాడారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులు, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు పరామర్శ

నాయుడుపేటటౌన్: పట్టణంలోని వైఎస్సార్ సీపీ ముస్లిం మైనారిటీ నాయకులు టీచర్ కాలేషాను సోమవారం సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ కో–ఆప్షన్ సభ్యురాలు షేక్ జరీనా భర్త టీచర్ కాలేషా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య టీచర్ కాలేషాను పరామర్శించారు. అనంతరం అస్వస్థతకు గురైన పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కామిరెడ్డి రాజారెడ్డిని, ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంత తీసుకుంటున్న పార్టీ బీసీ నాయకులు చిందేటి వెంకటేశ్వర్లును సంజీవయ్య పరామర్శించారు.
ఓజిలి: మండలంలోని ఆర్మేనిపాడులో పితృవియోగంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గుంటమడుగు నరేంద్రను, సగుటూరు గ్రామంలో వైస్ ఎంపీపీ లెక్కల ప్రసాద్ నాయుడును ఆ పార్టీ మండల కన్వీనర్ పాదర్తి హరినాథ్ రెడ్డితోపాటు మాజీ కన్వీనర్ దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు.


టీచర్ కాలేషాను పరామర్శిస్తున్న సంజీవయ్య

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

వెంకటగిరి రూరల్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీడీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు ఆర్ సాయిరామ్, జనరల్ సెక్రటరీ కె సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ పద్మావతికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డక్కిలి, బాలాయపల్లి మండల జనరల్ సెక్రటరీలు ఎస్ జోనేష్, కె శ్రీకృష్ణ, ఉపాధ్యాయులు భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

జీతాల కోసం కార్మికుల ఆందోళన

తడ: గత రెండు నెలలుగా జీతాలు ఇవ్వక పోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని యాజమాన్యం స్పందించి వెంటనే జీతాలు చెల్లించాలంటూ మాంబట్టు సెజ్‌లోని ఇన్ఫిలూమ్ (సాక్సుల పరిశ్రమ) పరిశ్రమకు చెందిన కార్మికులు సోమవా రం పరిశ్రమ వద్ద ఆందోళనకు దిగారు. ఉదయం కార్మికులు విధులకు వెళ్లకుండా గేటు బయట నిలబడి జీతాలు ఇస్తేనే విధులకు హాజరవుతామని డిమాండ్ చేశారు. దీనిపై పరిశ్రమ యాజమాన్యం స్పందిస్తూ అమెరికా తీసుకున్న నిర్ణయాలతో సంక్షోభంతో నెలకొన్నందున రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేకపోయామని చెప్పింది. ఈ నెలాఖరులోగా జీతాలు ఇస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించి విధులకు హాజరయ్యారు.

15 రోజుల్లో రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

నాయుడుపేటటౌన్: ప్రైవేటు గ్యాస్ పైప్‌లైన్ నిర్మాణం పేరుతో రెండేళ్ల కిందట పట్టణంలోని సిమెంట్ రోడ్లు ధ్వంసం చేశారని, వాటికి 15 రోజుల్లో మరమ్మతులు చేపట్టకపోతే వారిపై పోలీసు కేసులు నమోదు చేయాలంటూ మున్సిపల్ పాలక వర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో సోమవారం చైర్ పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన మున్సిపల్ మేనేజర్ ఊరు కుందమ్మ సారథ్యంలో పురపాలక సంఘ సమావేశం నిర్వహించారు. అజెండాలో రూపొందించిన 16 అంశాలతో పాటు టేబుల్ అజెండాలో పెట్టిన మరో 4 అంశాల వివరాలను కౌన్సిలర్లకు చదివి వివరించారు. ఇందులో పలువురికి భూముల కేటాయింపులపై కౌన్సిల్ సభ్యులు అభ్యంతరాలు తెలిపారు. పురపాలక సంఘం నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదించింది.


సమావేశంలో చైర్‌పర్సన్ కటకం దీపిక

ఆక్రమిత భూమి పరిశీలన

చిట్టమూరు: మండల పరిధిలోని నార్తువరత్తూరు గ్రామ కాట్రాయగుంట చెరువు ఎగువన ఉన్న ఆక్రమిత చెరువు పోరంబోకు భూమిని ఇరిగేషన్ ఏఈ షేక్ అబ్దుల్ ఘని సోమవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన అధికార పార్టీ నేత చెరువులో ప్రభుత్వ, భూమి, తెలుగు గంగ కాలువను జేసీబీతో పూడ్చి చదును చేసి పొలంగా మార్చేశాడని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరిగేషన్ ఏఈ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నివేదికను తహసీల్దార్ నరేష్ కుమార్‌కు అందజేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిలోకి ఎవరూ ప్రవేశించకూడదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

గాలికుంటు టీకాలు తప్పనిసరి


దక్కిలి: పశువుకు టీకా వేస్తున్న వైద్యులు

దక్కిలి/చిట్టమూరు/గూడూరురూరల్: పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని వెంకటగిరి పశువైద్యశాఖ ఏడీఏ డాక్టర్ శ్రీహరి తెలిపారు. మండలంలోని దేవునివెల్లంపల్లి, నాగవోలు గ్రామాల్లో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. చిట్టమూరు మండలంలో మొదటి రోజు 150 పశువులకు టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి సురేంద్ర తెలిపారు. గూడూరు మండలంలో 435 పశువులకు టీకాలు వేసినట్లు గూడూరు ప్రాంతీయ పశువైద్య కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ బి.సురేష్ తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ

వాకాడు: మండల కేంద్రంలోని ఎన్‌జేఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులకు సోమవారం దాతలు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. శ్రీకాళహస్తికి చెందిన సంఘ సేవకుడు కలవగుంట భరత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని స్వర్ణసాగరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రిని అందజేశారు.

అటవీ సంపదను కాపాడుకుందాం

బాలాయపల్లి(సైదాపురం): అటవీ సంపదను కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని వెంకటగిరి డిప్యూటీ అటవీశాఖ అధికారిణి సుహాసిని పేర్కొన్నారు. మండలంలోని పల్లిపాడు, మన్నూరు, జయంపు, పిగిలాం, చిలమనూరు ఓజిలి మండలం ఒజ్జవారిపాళెం గ్రామాల్లో అటవీ సంపదను కాపాడుకోవాలని నినదిస్తూ ర్యాలీలు చేశారు.

కండలేరులో 46 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 46.472 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10.2 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1400, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

షూటింగ్ పోటీలకు గూడూరు బాలికలు


విద్యార్థులతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

చిల్లకూరు: రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న రైఫిల్ షూటింగ్‌కు గూడూరు నుంచి ఇద్దరు బాలికలు ఎంపికైనట్లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. గూడూరు పట్టణంలోని ఎస్ఎస్ స్పోర్ట్స్ అకాడమిలో సోమవారం జిల్లా స్థాయిలో అండర్–14, అండర్–17 బాల బాలికల రైఫిల్ షూటింగ్ జిల్లా జట్టు ఎంపికను చేపట్టారు. ఇందులో గూడూరుకు చెందిన తేజస్వీ ప్రథమ స్థానం, మూడవ స్థానంలో ఈప్సీతశ్రీ నిలిచింది. వీరు త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని న్యాయ నిర్ణేతలు తెలిపారు.

22 నుంచి ఆరాధన బ్రహ్మోత్సవాలు

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని భగవతి శ్రీ మల్లికాంబ ఆరాధన బ్రహోత్సవాలను ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆమాస రామనారాయణ సో మవారం తెలిపారు. బ్రహోత్సవాల్లో భాగంగా ఆల యం వద్ద కలశ స్థాపన, ఆది పరాశక్తి, చండీహోమ పూజలు, చివరి రోజున పుష్ప యాగం నగరోత్సవంతో బ్రహోత్సవాలు ముగుస్తాయన్నారు.

వారిపై చర్యలు తీసుకోవాలి

గూడూరురూరల్ : గూడూరు పట్టణం కుమ్మరివీధి సమీపంలో ఉన్న శ్రీసత్యసాయి మందిరం దారిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీసత్యసాయి స్పిరిచువల్ సొసైటీ సభ్యులు కోరారు. వారు సోమవారం గూడూరు తహసీల్దార్ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఉచిత పశువైద్య శిబిరం


మందులు పంపిణీ చేస్తున్న కేపీసీఎల్ ప్రతినిధులు

చిల్లకూరు: వర్షాకాలంలో జాగ్రత్తలు పాటిస్తేనే పశువులు వ్యాధుల బారిన పడకుండా ఉంటాయని పశు సంవర్ధకశాఖ ఏడీ సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని వల్లిపేడు గ్రామంలో సోమవారం క్రిష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో అదానీ ఫౌండేషన్, క్రిష్ణపట్నం పోర్టు, పశు సంవర్ధక శాఖలు సంయుక్తంగా ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 150 పశువులకు వివిధ రకాల పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో పశు వైద్యులు ఉదయ్‌చైతన్య, లైవ్ స్టాక్ అసిస్టెంట్ బ్యూలా శాంతికుమారి, సుధీర్‌బాబు, చంద్రశేఖర్, కేపీసీఎల్ సీఈఓ వెంకటేశ్వర్లు, ఎస్‌కే షఫీ, సాయినాథ్, మస్తానయ్య పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలి

గూడూరురూరల్ : గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్‌ఏ)కు తెలంగాణ తరహాలో పే స్కేల్ అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర రావు, రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కె.బందకి సాహెబ్ డిమాండ్ చేశారు. ఈమేరకు గూడూరు సీఐటీయూ కార్యాలయం నుంచి టవర్‌క్లాక్ మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు వీఆర్‌ఏలు ర్యాలీ నిర్వహించారు. ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి, ఏఓ శిరీషకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో డివిజన్‌లోని 14 మండలాల వీఆర్‌ఏలతో సమావేశమయ్యారు. ఈ నెల 22, 23 తేదీల్లో విజయవాడలో జరిగే ధర్నాలో వీఆర్‌ఏలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, కేవీపీఎస్ నాయకులు అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, పామంజి మణి, వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షులు రామయ్య పాల్గొన్నారు.


గూడూరు సబ్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు, సీపీఎం, కేవీపీఎస్ నాయకులు

సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు

చిల్లకూరు : పరిశ్రమల యాజమాన్యాలు ప్రభుత్వానికి చెల్లించే సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని జిందాల్ పరిశ్రమల ప్రతినిధులు తెలిపారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో నూతనంగా జిందాలపరిశ్రమ, పెన్వర్ ఆక్వా, కంపెనీ సీఎస్ఆర్ నిధులతోపాటు, జిల్లా కలెక్టర్ ఇచ్చిన ప్రత్యేక నిధులతో గ్యాలరీని స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌తో కలసి వారు ప్రారంభించారు.

చెరువును అభివృద్ధి చేయాలి

వెంకటగిరి(సైదాపురం): పట్టణంలో ఉన్న అమ్మవారిపేట చెరువును అభివృద్ధి చేసి తిరుపతిలోని శిల్పారామం పార్కులాగా తీర్చిదిద్దాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరికంకరయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆ చెరువుతో పాటు పలు ప్రాంతాలను పరిశీలించారు. అమ్మవారిపేట చెరువు చాలా వరకు ఆక్రమణకు గురైందని స్థానికులు ఆయనకు వివరించారు.

17 నుంచి స్కూల్స్ గేమ్స్

సైదాపురం: స్కూల్ గేమ్స్ ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు మూడు రోజుల పాటు మండల కేంద్రంలోని గోగినేని వెంకటసుబ్బానాయుడు ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈఓ బాలసుబ్రమణ్యం తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయులు, పీఈటీలతో సమీక్షించారు. ఎంఈఓ మాట్లాడుతూ 17న వాలీబాల్, అథ్లెటిక్స్, 18వ తేదీన యోగా, చెస్, 19న ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

18 నుంచి క్రీడాపోటీలు

రాపూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 18, 19 తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాసులు, జిలాని తెలిపారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో సోమవారం పీడీలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 69వ స్కూల్ గేమ్స్ పోటీల్లో అండర్ 14, 17 బాల, బాలికలకు ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయన్నారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు సంబంధిత పాఠశాల పీడీలతో సంప్రదించాలని కోరారు.